# అతడు చచ్చిపోయాడు

శ్రీ చివుకుల సీతారామ్‌బాబు

తల తిప్పి చూశాడు అతడు.

దూరంగా ఉన్న మాసిన గోడమీద తను విప్పుడో ఇంటర్వ్యూలకు వెళ్ళినప్పటి రోజులు పెన్సిల్‌తో రాశాడు, అవి కనిపించాయి. ఆ గోడకే ఓ చిరిగిన తాజ్‌మహల్ కాలెండరు వ్రేలాడుతుంది. దాని ప్రక్కనేఉన్న మరో మేకుకు చిరిగి బాగా మాసిపోయిఉన్న ఫాంటు తగిలించి ఉంది.

గదికి మూలగా ఓ మట్టి కుండ, దానిమీద అంచులు పగిలిన గాజు గ్లాసు ఉన్నాయి. మరోమూల తుప్పుపట్టిన ట్రంకుపెట్టె ఉంది. అందులో ఏం ఉంటాయో అతనికి తెలుసు. తన డిగ్రీలు, కాండక్ట్ సర్టిఫికెట్లు, ఇంటర్వ్యూలకి రమ్మంటూ వచ్చిన ఉత్తరాలు, ఇంకా కొన్ని కవర్లు, తెల్లకాగితాలు తప్ప మరేం ఉండవు.

అతడు కూర్చున్న చోటునుంచీ లేచాడు.

గోడ దగ్గరకు వెళ్ళి చూశాడు. పెన్సిలుతో రాసిన అంకెలు కనబడ్డాయి దగ్గరగా. చివరిసారిగా ఇంటర్వ్యూకి వెళ్ళి ఎన్నిరోజులు అయిందో లెక్కవేశాడు. మూడునెలల పదిరోజులు.

నిట్టూర్చాడు ఒక్కసారి.

ఆ పెన్సిలు గీతల్ని చెరుపుదామని చేత్తో బలంగా రుద్దాడు. కానీ అవి చెరిగిపోలేదు. అతికినట్టుగా ప్రక్కలకు కూడా వ్యాపించాయి. ఆ పయత్నం మానుకుని ట్రంకుపెట్టె ముందుకువెళ్ళి కూర్చున్నాడు అతను. పెట్టె తెరిచి చూశాడు. మూతకి అంటించి ఉంది ఓ దేవుడి బొమ్మ.

దాన్నిచూసి అతనికి నవ్వొచ్చింది, నవ్వాడు కూడా పెద్దగా.

ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చినట్టు కాగితాలన్నీ క్రిందపడేసి పెటె అడుగున అంతా వెదికాడు, పాత బ్లేడుముక్క కన్పించింది. దాన్ని చేతులోకి తీసుకుని చూశాడు. బాగా తుప్పుపట్టిపోయిఉంది. అది తాను ఎప్పుడు కొన్నాడా అని ఆలోచించాడు కాసేపు, గుర్తు రాలేదు 'చాలా రోజులు అయి ఉంటుంది!' అనుకున్నాడు చివరికి.

బ్లేడుతో జాగ్రత్తగా చించుతూ ఆ బొమ్మను రేకుమీద నుంచి తొలగించాడు. బొమ్మ ఊడి చేతుల్లోకి వచ్చింది. దాన్ని చేతుల్లోకి పట్టుకుని పెట్టెమూసివచ్చి మళ్ళీ ఇందాకటి స్థలంలోనే కూర్చున్నాడు.

బొమ్మని నేలమీద ఉంచి బ్లేడుతోనే బొమ్మ రెండు కళ్ళ దగ్గిరా చిన్నకంతలు పెట్టాడు. ఇప్పుడు దాన్ని చూసేసరికి ఒక వింత అనిపించింది అతనికి. తర్వాత పొట్టమీద సున్నాలాగా కత్తిరించాడు. అంతమేరా కాగితం ఊడి చేతుల్లోకి వచ్చింది. ఆ కంతలోనుంచి అడుగున ఉన్న గచ్చు కన్పిస్తుంది. గచ్చుమీద ఉన్న పగులుచార కూడా కన్పించింది. ఆ తర్వాత అతను ఆ దేవుడి బొమ్మని మోకాళ్ళదాకా కోశేశాడు.

ఇప్పుడా బొమ్మని చూస్తుంటే మరీ మరీ నవ్వొచ్చింది అతనికి.

తర్వాత తల, చేతులు...ఇలా బొమ్మ మొత్తం ముక్కలు ముక్కలుగా కోశేశాడు. అలా చేసినందుకు అతనికి సంతోషం కలిగింది. ముక్కలు అన్నీకలిపి ఉండలాగా చుట్టి కిటికీలోనుంచి బయటికి విసిరివెయ్యబోయాడు. కానీ అవి కిటికీ చువ్వకి తగిలి మళ్ళీ లోపలపడ్డాయి చెల్లాచెదరుగా. లేచి వెళ్ళి ముక్కలు అన్నీ ఏరి కిటికీలోనుంచి బయటకు విశిరాడు.

ఆ సమయంలో అతనొక దృశ్యం చూశాడు.

పెరట్లోఉన్న బాత్ రూమ్‌లోనుంచీ అప్పుడే స్నానం ముగించుకుని ఇంటివారి రెండో అమ్మాయి ఇంట్లోకి వస్తుంది. వంటికి చీర అస్తవ్యస్తంగా చుట్టుకుని ఉండటంవల్ల మోకాళ్ళ క్రిందిభాగం అంతా కనిపిస్తూంది పచ్చగా.

అతను అలానే చూస్తున్నాడు.

పచ్చటి పిక్కలు! వాటిమీద నల్లటి వెంట్రుకలు! కాలి వేళ్ళకి ఉన్న మట్టెలు గచ్చుకి త[illegible]లుతూ శబ్దం చేసు[illegible] [illegible]మె తల పైకెత్తి చూసింది తనకేసే చూస్తున్న అతను కన్పించాడు.

గాభరాగా అడుగులు త్వరగా వెయ్యబోయింది. కానీ చేతిలోఉన్న సబ్బుబిళ్ళ జారి క్రిందపడటంతో సిగ్గుతో తల మునకలు అయిపోతూ వంగి సబ్బుబిళ్ళ అందుకుని లోపలికి పరిగెత్తింది.

అతను వెనక్కితిరిగివచ్చి కూర్చున్నాడు.

ఆ అమ్మాయి వంగినప్పుడు నీటిబిందువులతో ముత్యాలు పొదిగినట్టుగాఉన్న పచ్చటి వీపు అతనికళ్లముందు మెదిలింది. ఆ తర్వాత ఆమె మొగుడు ఎలాఉంటాడాఅని ఆలోచించాడు. ఆఅమ్మాయి మొగుడిని అతనుచూడలేదు అసలు ఇంతవరకు. ఎవరితోనో ఉంటూ ఈమెని వదిలేశాడు. అందుకనే ఆ అమ్మాయినిచూస్తే అతనికిజాలి.

జేబులు తడుముకున్నాడు అతను ఓసారి.

పదిపైసల నాణెం తగిలింది ఏత్తుగా. దాన్ని చేతులోకి తీసుకున్నాడు. బాగా పాతబడిఉంది. అక్కడక్కడా నల్లగా మకిలి పట్టి ఉంది నాణేనికి. అదితన జేబులోకి ఎప్పుడు వచ్చిచేరిందా? అని ఆలోచించాడు కాసేపు. రెండురోజుల క్రితం చివరిగా తన దగ్గర మిగిలిన అర్ధరూపాయిలో ఒకరొట్టె కొనుక్కుని సింగిల్ టీ తాగాడు ఎక్కడో కాకా హోటల్‌లో. అప్పుడు మిగిలి ఉండాలి.

దాన్ని మళ్ళీ జేబులో వేసుకున్నాడు.

అంతలో కిటికీలోనుంచీ ఓ పిచ్చుకవచ్చి కిచకిచమంటూ ఎగురుతూ గదంతా తిరగసాగింది. ఆ పిచ్చుక వైపేచూశాడు అతను కాసేపు. అది ఆగదిలోనే ఎక్కడున్నా ఆగితే బాగుండు! అనుకున్నాడు, కానీ అది ఆగలేదు. కొంతసేపు ఎగిరి కిటికీలోనుంచి ఎటో వెళ్ళిపోయింది.

అతను నిట్టూర్చి తలదించుకున్నాడు.

తను వేసుకున్న చొక్కా బాగా మాసిపోయి కనిపించింది. దాని మీద ఓ గ్రీసు మరకకూడా కనిపించింది అతనికి. చేత్తో తుడిచి చూశాడు పోతుందేమోనని, పోలేదు. చొక్కాని క్రిందికి వదిలేస్తూ మళ్ళీ ఆలోచించాడు అగ్రీసు మరక ఎప్పుడు అంటిందాఅని, గుర్తుకు రాలేదు. మరికొంతసేపు ఆలోచించి చూశాడు గుర్తు వస్తుందేమోనని, లాభంలేకపోయింది. అది గుర్తుకురాలేదు.

కానీ, చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటనమాత్రం గుర్తుకు వచ్చింది.

ఏదో చెరువుగట్టు, సాయంత్రంపూట, ఒడ్డునే కూర్చుని నీళ్ళల్లోకి రాళ్ళు విసురుతున్నాడతను. రాయి నీటిలోపడి పడినప్పుడల్లా అలలు బయలుదేరి చుట్టూ పోతున్నాయి. కొంతసేపు అలా రాళ్ళు విసిరేసరికి విసుగు అనిపించి మానేశాడు. కొంతసేపటికి ఓ కప్పపిల్ల కన్పించింది నీటిమీద. తనకేసే చూస్తుంది. అది అసలు కళ్లు ఆర్పుతుందో లేదోకూడా తెలియలేదు. కాసేపుచూసి ఓరాయి విశిరాడు దానికేసి గురిచూసి. కానీ రాయి దానికి తగలకముందే నీళ్ల ల్లోకి మునిగిపోయింది ఆ కప్పపిల్ల. ఆ కప్ప ఇంకా బ్రతికి ఉందో లేదో? అనిపించింది అతనికి. కాని అది ఇంకా బ్రతికి ఉండదని మాత్రం సమాధానం చెప్పుకున్నాడు తనకు తానే.

చుట్టూ చూశాడు.

ఇందాకటి వస్తువులే మళ్లీ కన్పించాయి కళ్ళకి. వాటి స్థానంలో ఏ మార్పూ రాలేదు. కానీ ఓ విషయంమాత్రం గమనించాడు అతను. కిటికీలోనుంచీ ఎండ గదిలోకి పడుతుంది కొంతమేర. ఆ ఎండని ముక్కలుగా కోసినట్టు మధ్యలో కిటికీచువ్వల నీడలు కనబడుతున్నాయి. మొత్తం ఎన్నిచువ్వలు ఉన్నాయో లెక్కపెట్టాడు, ఆరు!

తల వంచుకుని కూర్చున్నాడు.

కాళ్ళు కనబడ్డాయి. అరికాళ్ళకేసి చూశాడు. నల్లగా మట్టి పట్టి ఉన్నాయి. ఎడమ అరికాలిలో కన్పించింది లోతుగాఉన్న చిన్న గుంట.

అది ఎలా ఏర్పడిందో అతనికి గుర్తుంది. ఓరోజు రాత్రి పూట నడిచివస్తున్నాడు చీకట్లో. కసుక్కున ఏదో దిగబడింది కాలిలో. వొంగిదాన్ని లాగి వెలుతురులోకి వచ్చినతర్వాత చూశాడు. పెద్దగాజుముక్క! వజ్రంలా తళతళా మెరిసింది. ప్రక్కనఉన్న కాలవలోకి విసిరి వేశాడు తర్వాత. ఆగాజుపెంకు ఇంకా అక్కడే ఉండి ఉంటుందా? అనిపించింది. ఉంటుందో లేదోమాత్రం అతను ఊహించలేకపోయాడు.

అరికాళ్ళని చేత్తో ఓసారి రాశాడు.

గరుకుగా ఉన్నది చర్మం. మొద్దుబారిఉంది అరికాలంతా. ఎందుకనో వాటిని చూస్తూంటే అతనికి చెప్పలేని ప్రేమకలిగింది అరికాళ్ళమీద. కష్టంమీద ముందుకువంగి వాటిని ముద్దుపెట్టుకున్నాడు. చల్లగా తగిలింది చర్మం పెదవులకి. తర్వాత మళ్ళీ మామూలుగా కూర్చుని ఆలోచించసాగాడు.

తను అడుగులు వెయ్యటం నేర్చుకున్న దగ్గరనుంచీ ఇప్పటి

వరకు అవి తన శరీరాన్ని ఎన్నో వేల మైళ్ళు తీసుకువెళ్ళి ఉంటాయి. కానీ ఏనాడూ వాటినిగురించి ఇలా ఆలోచించటం జరగలేదు, ఎందుకని ?

నవ్వొచ్చింది అతనికి.

తనెవరు ? అవి ఎవరివి ? కాళ్ళు, చేతులు, ముఖం, తల అన్నీ కలిపితేనేగా తను తయారు అయింది !

చేతులకేసి చూసుకున్నాడు ఓసారి.

రెండు మూడు వొంపులు తిరిగిన పెద్ద రేఖలు కనిపించాయి అరచేతిలో. తను ఎన్నోసార్లు అనుకున్నాడు ఎవరికి అయినా చెయ్యి చూపించుకోవాలని. ఆరేఖలు దేన్ని తెలుపుతాయో అడగాలనుకున్నాడు, కానీ ఇంత వరకు అలా చెయ్యటం జరగలేదు.

అరచేతుల్లో ముఖం ఉంచుకుని కళ్ళుమూసుకున్నాడు, కళ్ళ ముందు చీకటి ప్రత్యక్షం అయింది గాఢంగా. తను అన్నం తిన్నది ఆచేతులతోనే, చిన్నప్పుడు పేము బెత్తం దెబ్బలు తిన్నది ఆచేతులే, పరీక్షలు రాసిందీ ఆచేతులతోనే, స్కాలర్‌షిప్పులు తీసుకున్నదీ ఆ చేతులతోనే, చదువుల్లో స్కూల్ ఫస్టు వచ్చినప్పుడు కలెక్టరుగారు షేక్ హాండు ఇచ్చిందీ, కాలేజీలో డిబేట్స్‌లో పాల్గొంటే వచ్చిన మెడల్‌ల్ని అందుకున్నదీ ఆచేతులే. ఆఖరికి తన డిగ్రీ సర్టిఫికెట్టుకూడా తీసుకున్నది ఆచేతులమీదుగానే.

మనసంతా అదోలా అయిపోయింది అతనికి.

ఏడుపు వచ్చింది. ఆ బాధలో కొంతసేపు ఏదీ ఆలోచించలేకపోయాడు. కొంత సేపటి తర్వాత తల్లి గుర్తొచ్చింది. బొట్టులేని ఆమె నుదురు గుర్తొచ్చింది. కళ్ళక్రింద ఉండే నల్లటి చారికలు గుర్తొచ్చాయి. అప్పుడప్పుడు ఆమె కళ్ళల్లోంచి గిర్రున తిరిగి క్రిందకు రాలే కన్నీటిబిందువులుకూడా గుర్తొచ్చాయి. తనతల్లి ఇప్పుడు ఈలోకంలో లేదు. మరోలోకానికి పోయిందా ? ఒకవేళ తనుకూడా చనిపోతే ఆలోకానికే పోవాలికదా ! అప్పుడు అమ్మ తనని గుర్తుపడుతుందా ? అసలు అమ్మరూపం ఇంకా అలానే ఉంటుందా?

గట్టిగా నిట్టూర్చాడు అతను ఓసారి.

తనకి బాగా గుర్తు ! రాత్రిళ్ళు వంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తుండేది అమ్మ మధ్యలో తనకు మెలకువవచ్చి చూసేవాడు. అమ్మకళ్ళవెంట నీళ్ళు వస్తుండేవి. తను పిలిచేసరికి అమ్మ ఉలిక్కిపడి చూసేది. తనని దగ్గరకు తీసుకుని 'భయంలేదు పడుకోబాబూ! నీకు నేను ఉన్నాగా' అనేది. అప్పుడు తనకో అనుమానం వచ్చేది. 'మరి నీకు భయం వేస్తే ఎవరున్నారు' అని అడగాలనిపించేది. కానీ ఏనాడూ ఆ ప్రశ్న వెయ్య లేదు. మౌనంగా ఆమె గుండెలమీద తల ఆన్చి నిదురపోయేవాడు. నిదురలోకి జారిపోయే వరకు ఆమె గుండెలు కొట్టుకోవటం స్పష్టంగా వినిపించేది. ఆ గుండె కొట్టుకున్న చప్పుడు తనకి ఇప్పటికీ గుర్తువుంది.

తల తిప్పి చుట్టూ చూశాడు అతడు.

కిటికీలోనుంచి ఎండ ఇంకా పడుతూనేఉంది. ఇందాకటి చోటునుంచీ ఇప్పుడు మరికాస్త ముందుకు జరిగినట్టుగాఉంది.

మళ్ళీ ఆలోచనలోపడిపోయాడు.

చిన్నప్పుడు తన ఇంటిలో ఓ మూలగా పెరిగిన పెద్ద జిల్లేడు చెట్టు గుర్తొచ్చింది. చాలా పెద్దదిగానే పెరిగింది అది. తెల్లటి పూలతో ఉండేది. ఓసారి ఎక్కడినుంచో బుల్లి రంగురంగుల పిట్ట వచ్చివాలింది జిల్లేడు కొమ్మలమీద. ముక్కుతో కొమ్మమీద అటూ ఇటూ రాసింది. అది ఆ జిల్లేడు చెట్టుమీదనే గూడు కట్టుకుంటే బాగుండు అనుకున్నాడు తను ఆ సమయంలో. అది కొంతసేపు కొమ్మమధ్య నుంచిని తర్వాత ఎగిరిపోయింది అరుచుకుంటూ. ఆ తర్వాత వరుసగా రెండు మూడు రోజులపాటు ఎదురుచూశాడు మళ్ళి ఆపిట్ట వస్తుందేమోనని. కాని అది రాలేదు. తర్వాత దానికోసం ఎదురు చూడటం మానేశాడు.

కిటికీ ప్రక్కనుంచీ ఓకాకి పెద్దగా అరుచుకుంటూ పోవటంతో అతని ఆలోచనకు అంతరాయం కల్గింది. కిటికీకేసి చూశాడు. కాని అప్పటికే కాకి కిటికీదాటి వెళ్ళిపోయింది. మరి కనపడలేదు తల తిప్పుకున్నాడు.

దాహం అని పించింది.

లేచి మూలనున్న కుండదగ్గరకి వెళ్ళాడు. అడుగున కాసిని మాత్రమే ఉన్నాయినీళ్ళు. కుండవంచుకున్నాడు. గ్లాసులోకి మూడు వంతులదాకా వచ్చాయినీళ్ళు. ఆ కాస్తా గొంతులో పోసుకుని గ్లాసు క్రింద పెట్టివచ్చాడు.

మళ్ళీ అక్కడే కూర్చోవాలనిపించలేదు.

కిటికీ దగ్గరకి వచ్చినిలబడ్డాడు.

క్రింద ఇంటివారి రెండో అమ్మాయి బటలు ఆరేస్తుంది తాడుమీద. చీర పైకి ఎగదోపింది. మళ్ళీ కన్పించాయి అతనికి —

పచ్చని పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు! మట్టెలు నిండపడి మెరుస్తున్నాయి.

తల ఎత్తి చూసింది ఆ అమ్మాయి. తనవైపే చూస్తున్న అతను కన్పించాడు. సిగ్గు వచ్చింది ఆ అమ్మాయికి. అక్కడినుంచి వెళ్ళిపోవాలనిపించింది. కానీ పని సగంలో ఉండటంలో ఆ పని చెయ్య లేక మళ్ళీ బట్టలు ఆరేయసాగింది,

అతను ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు.

ఇందాక పచ్చగా విశాలంగా కన్పించిన వీపుని ఇప్పుడు ఎర్రటి జాకెట్టు కప్పి ఉంచింది. జాకెట్టు చెమటకు తడిసి వీపుకి అంటుకు పోయి ఉంది.

కిటికీ దగ్గరనుంచి వెనక్కి తిరిగాడు అతను.

పెట్టె దగ్గరకువచ్చి కూర్చున్నాడు. కాగితాలన్నీ తీసి బయట పెట్టాడు. వాటి అన్నిటినీ చూస్తుంటే విచారం అనిపించింది. కానీ ఏదో నిశ్చయించుకున్నట్టుగా తల ఊపి ఒక్కొక్క కాగితమూ చింపి ముక్కలు చేయసాగాడు. తన డిగ్రీ కాగితాన్ని చింపుతుంటే దుఃఖం పొంగివచ్చింది అతనికి. అతి కష్టంమీద నిగ్రహించుకుని దాన్నికూడా చింపి ముక్కలు చేశాడు.

కొంతసేపటికి కాగితం ముక్కలన్నీ కుప్పగా పోగు అయ్యాయి.

వాటి అన్నిటినీ తగులపెట్టాలనిపించింది. చుట్టూ చూశాడు. గదిలో ఎక్కడా అగ్గిపెట్టె కన్పించలేదు. కానీ ఆ కాగితాలను అలానే వదలబుద్ధి కాలేదు. మేడదిగి క్రిందకు వచ్చాడు. ఇంటి వారింట్లోకి వెళ్ళాడు. వాళ్ళ రెండో అమ్మాయి వస్తుంది లోపలినుంచి. బట్టలు ఆరేయటం అప్పుడే పూర్తి అయినట్టు ఉంది. చిరపైకే కట్టి ఉంది. మళ్ళీ కన్పించాయి అతనికి పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు!

"అగ్గిపెట్టె!"

"కావాలా?"

తల ఊపాడు అతను.

లోపలికి వెళ్ళి అగ్గిపెట్టె తెచ్చి ఇచ్చింది ఆ అమ్మాయి.

అగ్గిపెట్టె అందుకుంటున్నప్పుడు అతని వేళ్ళు ఆమె వేళ్ళకి తగిలాయి. ఒక్కసారిగా తన శరీరంలోనికి విద్యుత్ ప్రసారం జరిగి నట్టుగా అనిపించింది ఆమెకి. సిగ్గుతో కళ్ళు మూతలు పడి పోయాయి. బలవంతాన రెప్పల్ని తెరచి అతనికేసి చూసింది. నుదుటి మీద నరాలు తేలి ఉన్నాయి అతనికి. కళ్ళు ఎర్రటి జీరలతో నిండి ఉన్నాయి. ఎటో చూస్తున్నట్టుగా ఉన్నాయి చూపులు. అతను ఎందుకు అలా ఉన్నాడో అడగాలనిపించింది ఆమెకి. కానీ అప్పటికే అతను అగ్గిపెట్టె తీసుకొని వెనక్కి తిరిగాడు. ఆమె కూడా లోపలికి నడిచింది.

"నడుస్తున్నవాడల్లా వెనక్కి తిరిగి చూశాడు అతను.

ఆమె వెళ్ళి పోతుంది లోపలికి. మట్టెలు చప్పుడు అవుతు న్నాయి గచ్చుకు తగిలి. పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రు కలు! తల తిప్పుకుని గబగబా ముందుకు నడిచాడు.

గదిలోకి వెళ్ళేసరికి కాగితం ముక్కలు కొంత చెదిరి ఉన్నాయి గాలికి. మళ్ళీ అన్నిటినీ పోగుచేశాడు. అగ్గిపుల్ల వెలిగించి ఒక్కక్షణం పాటు చూశాడు ఆ జ్వాలవైపు. ఆ కాస్త జ్వాల ఇన్నేళ్ళ తన చదు వుని రూపులేకుండా చేస్తుంది, కొద్దిసేపటిలో అతనిలో మళ్ళీ దుఃఖం కట్టలు త్రెంచుకోసాగింది.

కానీ ఎంతో కష్టంమీద దాన్ని నిగ్రహించుకుంటూ మంటని కాగితాలకి తాకించాడు. అడుగెత్తున లేచింది మంట. ఎర్రటి ఆ మంటలో తన బడి చదువు కన్పించింది. తన కాలేజీ జీవితం కన్పించింది. డిగ్రీ తీసుకుంటున్న దృశ్యం కన్పించింది. అరచేతులలో ముఖాన్ని కప్పుకుని నిశ్శబ్దంగా రోదించాడు అతను.

కొంతసమయం గడిచింది.

కన్నీళ్ళు తుడుచుకుంటూ చేతులు తొలగించాడు అతను ముఖానికి. అప్పటికి కాగితాలు అన్నీ కాలిపోయి ఉన్నాయి. నుసి గాలికి చెదిరి గది అంతా పరచుకుంది.

లేచి నిలబడ్డాడు అతను.

గోడదగ్గరకు వెళ్ళాడు. కనుపాపలపై నీటిపొర కమ్ముకుని ఉండటంవల్ల దానిమీద గీసిన అంకెలు కన్పించలేదు సరిగ్గా. తాజ్ మహల్ కాలండర్‌కేసి చూశాడు ఓ రెండు నిముషాలపాటు. తర్వాత మూలనున్న కుండదగ్గరికి వెళ్ళాడు. అది ఎన్నేళ్ళగానో ఉంది తన గదిలో. మంచినీళ్ళు తాగుదామనిపించింది. అతనికి ఆ కుండలోనివి. కానీ నీళ్ళు ఇందాకనే అయిపోయాయన్న విషయం గుర్తొచ్చి ఆ ఆలోచన

విరమించుకున్నాడు. కుండని ఓసారి చేత్తో తాకి చూశాడు, చల్లగా తగిలింది.

అగ్గిపెట్టె చేత పట్టుకుని బయటకు వచ్చాడు గదికి తాళం వెయ్యాలనిపించలేదు. గోళ్ళెం పెట్టి క్రిందికిదిగి వచ్చాడు. ఇంటవారి రెండో అమ్మాయి వాకిలి ఊడుస్తుంది. చీర పైకే కట్టుకుని ఉంది.

పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు!

ముందుకు నడిచి అగ్గిపెట్టె చేతిలో ఉంచాడు. అగ్గిపెట్టె తీసుకుంటుంటే మళ్ళీ ఆమెవేళ్ళు అతని వేళ్ళకు తగిలాయి. మళ్ళీ విద్యుత్ ప్రసారం జరిగినట్లు అయింది వేళ్ళ చివరనుంచి. సిగ్గొచ్చింది. అయినా తలఎత్తి అతనికేసి చూసింది. అతని కళ్ళల్లో ఎర్రజీరాలు ఇందాకటికన్నా అధికంగా కన్పిస్తున్నాయి.

'ఎందుకు అలా ఉన్నారు?' అని మళ్ళీ అడుగుదామనుకుంది. కానీ అప్పటికే అతను వెనక్కి తిరిగాడు. ఆమె లోపలికి నడిచింది.

గేటు దాటుతుండగా వెనక్కి తిరిగి చూడాలనిపించింది అతనికి. చూశాడు. చీర కప్పిలేని పచ్చటి పిక్కలు! దానిమీద నల్లని వెంట్రుకలు! మువ్వెలశబ్దం వినిపిస్తుంది గచ్చుకు తగిలి.

తలతిప్పి గబగబా ముందుకు నడిచాడు అతను.

ఎండవేడికి కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయి. అయినా ఆ బాధ అతనికి తెలియటంలేదు. వడివడిగా అడుగులు వేస్తున్నాడు. మనస్సు నిండా ఏవో ఆలోచనలు!

చిన్నప్పటి ఇంగ్లీషుపాఠం గుర్తొచ్చింది. అదంటే అతనికి ఎంతో ఇష్టం. పేరు గుర్తురాలేదు. ఒక విద్యార్థి తన గురువుగారి కూతుర్ని ప్రేమిస్తాడు. ఓరోజు తన ప్రేమని బయట పెడతాడు. ప్రేమకానుకగా ఓ ఎర్రగులాబిపువ్వు తెచ్చి ఇవ్వమని అడుగుతుంది ఆమె...అంతే! తర్వాత ఏమయిందో గుర్తుకు రాలేదు అతనికి. గుర్తుకు తెచ్చుకోవాలని చాలా ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది. ఎందుకని అలా అయిందో అర్థంకాలేదు అతనికి.

తల ఎత్తి చూశాడు.

దూరంగా రైలుగేటు కనబడింది.

ఇంక కథగురించి ఆలోచించకూడదనుకున్నాడు. మనసునిండా అస్తవ్యస్తమయిన ఆలోచనలు రగులుతున్నాయి. దేనికీ ఆరంభం ఉండటంలేదు, అంతం కూడా ఉండటం లేదు. అక్కడక్కడా... కొంచెం కొంచెంగా...ఇరవైఎనిమిదేళ్ళ జీవిత జ్ఞాపకాలు ఒకదాన్ని ఒకటి నెట్టుకుని వెలుపలికి రావాలని ప్రయత్నిస్తున్నాయి.ఆ సంఘర్షణలో ఏ ఆలోచనా తుదివరకు నిలబడటంలేదు.

రైలుగేటు దగ్గరయింది!

అటూఇటూ చూశాడు అతను. గేటు వేసిఉంది. కానీ కనుచూపుమేరలో ఎక్కడా రైలు వస్తున్నజాడ కనబడటంలేదు. జేబులోని పదిపైసలు గుర్తొచ్చాయి. ఏం చెయ్యాలాఅని ఆలోచించాడు. చెట్టునీడన అక్కడికి దగ్గరలోనే కూర్చునిఉన్న ఓ ముసలి బిచ్చగాడు కన్పించాడు అతని కళ్ళకి. గబగబా వెళ్ళి ఆ పదిపైసలు అతనికి ఇచ్చి రైలుపట్టాల వెంట నడవటం మొదలుపెట్టాడు. రైలుగేటు క్రమంగా దూరం కాసాగింది.

తలఎత్తి చూశాడు అతను.

దూరంగా పొగను చిమ్ముతూ వస్తున్న రైలు కన్పించింది.

అదిచూచి అతనిలో ఏదో నూతనోత్సాహం బయటికి వచ్చింది.

'మరికొద్ది క్షణాల్లో తనీలోకంనుంచీ శాశ్వతంగా శలవుతీసుకుంటాడు!' అనుకున్నాడు.

దూరంగా రోడ్డుమీదపోతున్న ఓ మూడేళ్ళపిల్ల ఏడుస్తూ పోతుంది. అటుచూశాడు. ఆపిల్ల కాళ్ళకి చెప్పులులేవు. జాలేసింది అతనికి ఆపిల్లమీద. వెంటనే తన మనస్సుని దానినుండీ మరల్చుకున్నాడు. ఇంక కొంతసేపటిలో తానీలోకంనుంచీ శాశ్వతంగా నిష్క్రమిస్తున్నప్పుడు, ఈ కాసేపట్లోనే ఒకళ్ళపై జాలి, మరొకళ్ళపై ప్రేమ-ఇవన్నీ అనవసరం అనిపించింది అతని హృదయానికి.

రైలు వంద గజాలదూరంలోకి వచ్చేసింది.

దూరంగా రైలుగేటుదగ్గరనుంచీ కేకలు పెడుతున్నారు ఎవరో. వాళ్ళ కేకలకి జాలిపడ్డాడు అతను. తను వచ్చింది తప్పుకోటానికా?

ఉన్నపాటున రైలు పట్టాలకి అడ్డంగా పడుకున్నాడు.

అడుగున స్లీపర్ తాలూకు పేడు అతని వెన్నులో గుచ్చుకుంది. ఎర్రటి ఎండలో ఉదయంనుంచీ కాలుతున్న రైలుపట్టాలు, అప్పుడే కొలిమిలోనుంచీ తీసిన ఉక్కుకడ్డీలలా కాలుస్తున్నాయి అతని శరీరాన్ని. కంటికి ఎదురుగా నీలంగా, విశాలంగాఉన్న ఆకాశం కన్పించింది. తెల్లగా దూది పింజల్లాఉన్న మేఘాలు కన్పించాయి. మేఘాల మధ్యగా ఎంతో ఎత్తులో ఎగురుతున్న గద్దలు కన్పించాయి.

తల్లి గుర్తొచ్చింది ... చచ్చిపోయినతర్వాత బిగుసుకుపోయిన ఆమె కాలివేళ్ళు! ... తన అరికాళ్ళు...నల్లటినుసి...పచ్చటి పిక్కలు ...నల్లటి వెంట్రుకలు...మువ్వెలశబ్దం...పసిపాపఏడుపు...అరుపులు ...గోల...కేకలు...రైలుపట్టాల దడదడ...ఇంజనుకూత...

"అమ్మా!!!"

*　　*　　*

సరిగ్గా అదే సమయంలో అతనుఉండే ఇంటి వాకిట్లో పోస్ట్‌మేన్ కేక పెడుతున్నాడు —

"సత్యనారాయణరావుగారూ!"

అతని చేతిలో ఓకవరు ఉంది.